క్లుప్తంగా

అన్నదాన సత్రానికి విరాళం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని పట్రా నాయుళ్ల అన్నదాన సత్రానికి దాతలు రూ.లక్ష విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో పులివెందుల మునిసిపల్ కౌన్సిలర్ సోకే వెంకటరమణ (కోడి రమణ), పట్రాకుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్ బాషా కోరారు. ఆయన సోమవారం పెన్నానగర్‌లో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ కాలువలు లేని కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీధుల్లో మురుగు నీరు ప్రవహిస్తున్న కారణంగా ప్రజలు రోగాల మారిన పడుతున్నారని తెలిపారు.

నాఫెడ్‌కు భూమి కేటాయింపు

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్‌కు భూమిని కేటాయిస్తూ జీఓ జారీ చేసినట్టు రైతు నాయకుడు, బీజేపీ మాజీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బీపీ ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాఫెడ్ కోసం ఎస్.మైదుకూరు పరిధిలోని సర్వే నంబర్లు 1124/1ఏలో 2.10 ఎకరాలు, 1124/2బీలో 2.24 ఎకరాలు, 1125/1ఏలో 0.25 ఎకరాలు, 1125/2బీ2లో 0.49 ఎకరాలు మొత్తం 5.08 ఎకరాలను నాఫెడ్ కొనుగోలు చేసినట్టు ఆయన వివరించారు. ఈ భూముల్లో రైతులకు ఉపయుక్తంగా ఉండే గోదాములను నాఫెడ్ నిర్మిస్తుందని పేర్కొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కాశినాయన : మండలంలోని వృద్ధులు, దివ్యాంగులు పోరుమామిళ్ల గవర్నమెంట్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించే వైద్య శిబిరంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మైథిలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు ఆధార్ కార్డు, వికలత్వ ధ్రువీకరణ పత్రం, వృద్ధులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, రెండు ఫొటోలు తీసుకోవాలని ఆమె సూచించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన పరికరాలను అందజేస్తారని తెలిపారు.

పనిచేయని సెల్‌ఫోన్లు వద్దు

ప్రొద్దుటూరు : పనిచేయని సెల్‌ఫోన్లు వద్దని, వాటి స్థానంలో ట్యాబ్‌లు, 5జీ సిమ్‌లు ఇచ్చి యాప్‌లు బాగా పనిచేసే సాఫ్ట్‌వేర్ పొందుపరచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు నాసిరకం సెల్‌ఫోన్లు అందించి వాటిలో అనేక రకాల యాప్‌లు తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గత నాలుగేళ్ల నుంచి జీతాలు పెంచాలని ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, అధ్యక్షురాలు రాణి, గీత, నాగలక్ష్మి, రామసుబ్బమ్మ, రాజుపాళెం సెక్టార్ నుంచి ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ కోసం శిబిరాలు

అట్లూరు : అట్లూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 5వ తేదీన జిల్లా పరిపాలనా యంత్రాంగం కడప వారి సహకారంతో భారత ప్రభుత్వ కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో) కంపెనీ సహకారంతో వికలాంగులు, వయోవృద్ధుల ఉపకరణాల పంపిణీ కోసం నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వెంగమునిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిబిరంలో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించేందుకు దివ్యాంగుల వద్ద కొలతలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకోసం అర్హులైన ప్రతి దివ్యాంగుడు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదానం పుణ్యకార్యం

ప్రొద్దుటూరు : అన్నదానం పుణ్యకార్యమని శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు కెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఆలయంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం కార్యక్రమం ఏర్పాటు చేశారు. శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు మురుకూటి సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలి

మైదుకూరు : రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా చేయాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మైదుకూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 3ను అనుసరించి రాయలసీమలోని నాలుగు జిల్లాలతోపాటు నెల్లూరు, ప్రకాశం, తమిళనాడులోని వేలూరు, కృష్ణగిరి, కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, చిత్రదుర్గ, కోలార్ జిల్లాలతో ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

బీమా ప్రీమియం.. రైతులకు భారం

కూటమి పాలనలో బీమా మొత్తాన్ని రైతులే చెల్లించాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వం చెల్లించడంతో రైతులకు ఊరట కలిగింది. పైగా పంట నష్టపోయిన వారికి సకాలంలో నష్టపరిహారం అందింది. అయితే కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో ఇది కూడా రైతులకు భారంగా మారింది.



ఖాజీపేట : ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద రైతులు వరి పంటకు ఆగస్ట్15వ తేదీలోగా బీమా ప్రీమియం చెల్లించాలి. అలాగే పప్పు ధాన్యాలు,(కంది), జొన్న, మినుము, ఉల్లి, పసుపు పంటలకు జులై 31వ తేదీకి గడువు ముగియడంతో రైతులు బీమా చెల్లించారు. రైతులు ఈ బీమా మొత్తం చెల్లిస్తే.. అకాల వర్షాలు, తెగుళ్లు సంభవించినప్పుడు పంట దెబ్బతింటే పరిహారం అందుతుంది. ఈ మేరకు వ్యవసాయ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. పంట నష్టం లేక ఇతర రకాలైన నష్టపరిహారం పొందాలంటే పంట నమోదు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. బీమా నమోదు చేసుకోకపోతే పరిహారం అందదని గట్టిగా చెబుతున్నారు.

ఉచిత బీమాకు చెక్

ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా, వాతావరణపరమైన పంటలకు ఇఫ్‌కో టోకియో ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియాకు బీమా మొత్తం చెల్లించి రైతులు పంట నమోదు చేసుకోవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇందుకు సంబంధించిన ప్రీమియం రైతులు చెల్లించేవారు కాదు. ప్రీమియం మొత్తం ప్రభుత్వమే రైతుల తరఫున చెల్లించింది. నష్టపరిహారం కూడా రైతులకు సకాలంలో అందింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రీమియం చెల్లించకుండా చేతులెత్తేసింది. రైతులే చెల్లించాలని చెప్పింది. దీంతో రైతుల ఉచిత బీమాకు చెక్‌పడింది.

మీ సేవలో నమోదు చేసుకోవాలి

రైతులు పంట నష్టపరిహారం బీమా ప్రీమియం మీ సేవా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలి. నష్టపరిహారం అక్కడే కట్టించుకుంటారు. పరిహారం కట్టామని ఆలోచించకుండా రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలి.

– నాగార్జున, ఏవో, ఖాజీపేట

ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి

రైతులు చెల్లించే బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల తరఫున ఉచితంగా చెల్లించింది. నేడు రైతులే ప్రీమియం చెల్లించాలని చెప్పడం సరైంది కాదు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు రైతులకు అండగా నిలవాలి.

నాగిరెడ్డి, రైతు విభాగం అధ్యక్షుడు, మైదుకూరు

అంగన్వాడీ వర్కర్లను యాప్‌లతో వేధించడం సరికాదు



సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

బద్వేలు అర్బన్ : అంగన్వాడీ కేంద్రాల పనితీరు విషయంలో రోజుకొక యాప్ రూపొందించి అంగన్వాడీ వర్కర్లను వేధించడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. అంగన్వాడీ వర్కర్లను తీవ్ర మనస్తాపానికి గురిచేస్తున్న యాప్‌లను ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి యాప్‌లను సపోర్ట్ చేయని మొబైల్ ఫోన్లను సీడీపీఓకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు అందిస్తున్న సేవలను యాప్‌ల ద్వారా అప్‌లోడ్ చేయాలని వేధించడం సరికాదన్నారు. కొన్ని ప్రాంతాల్లో సరైన సిగ్నల్స్ లేక అంగన్వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, కో కన్వీనర్ కొండయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు సుభాషిణి, ప్రాజెక్టు నాయకురాళ్లు జయప్రద, లక్ష్మీనరసమ్మ, కె.వి.సుభాషిణి, సుజాత, అమ్మణ్ణి, నాగకుమారి, సుధ, శోభ, రాధమ్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా గడువు పొడిగింపు

మైదుకూరు : ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు బీమా వర్తించేందుకు పంటల నమోదు కోసం గడువును ప్రభుత్వం పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీమా నమోదును రైతులు ఆగస్టు 14వ తేదీ వరకు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రైతులందరూ తాము సాగు చేసిన పసుపు, ఉల్లి, కంది, వరి, మినుము, జొన్న తదితర పంటలకు బీమా చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలను కలిసి పంట సాగు చేసినట్టు ధ్రువీకరణ పత్రాన్ని పొంది మీ సేవ కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అట్లూరు : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం రాత్రి మండలంలోని ఎస్.వెంకటాపురం కాలనీలో పోలీసు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రజలు అప్రమత్తతతో వాటి నుండి దూరంగా ఉండవచ్చని తెలిపారు. లేనిపక్షంలో ప్రజలు సైబర్ నేరగాళ్ళ వలన నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఎర్రచందనం నరకడం, రవాణా చేయడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు సంజీవని

కాశినాయన : తల్లిపాలు బిడ్డకు సంజీవనిగా పనిచేస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, ఏఎన్ఎం స్రవంతి అన్నారు. సోమవారం మండలంలోని ఆకులనారాయణపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట లోపే తల్లిపాలను తప్పనిసరిగా తాపించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి సహజ టీకా అన్నారు. ఇందులో ఉన్న ప్రొటీన్లు, ఫ్యాటీయాసిడ్స్, విటమిన్లు బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు, రోగనిరోధక వ్యవస్థను బలపరిచేందుకు తోడ్పడుతాయన్నారు. అలాగే వ్యాధుల నుంచి రక్షణ కలిస్తాయన్నారు. బిడ్డతోపాటు తల్లి ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త తులశమ్మ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వసతులపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ కోడూరు చెన్నమ్మ

బి.కోడూరు : మండలంలో పది పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ కోడూరు చెన్నమ్మ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీడీఓ భాస్కర్‌రావు అధ్యర్యంలో ఎంపీపీ కోడూరు చెన్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో విద్యుత్ కోతలు అధికమయ్యాయని, వ్యవసాయానికి సంబంధించిన 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరిగా అందడం లేదని, విద్యుత్ కోతల కారణంగా బోరుబావుల కింద సాగు చేసిన వరిపంట ఎండుముఖం పడుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా ప్రస్తుతం మండలంలో సరైన వర్షపాతం నమోదుకాకపోవడం వలన కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. బోడుగుండుపల్లె, మూలవారిపల్లె, తిప్పరాజుపల్లె గ్రామాలకు సంబంధించి ఆయకట్టు రోడ్లు, శ్మశాన రోడ్లు సరిగా లేవని, వాటిని పునరుద్ధరించేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉపాధి పని దినాలను పెంచాలని తెలిపారు. అనంతరం అన్నిశాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బిషప్ పట్టాభిషేక మహోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్, ఆశిష్ గాబ్రియేల్

కలసపాడు : నంద్యాల డయాసిస్ నూతన బిషప్‌గా కలసపాడుకు చెందిన రెవరెండ్ కామనూరు సంతోష్ ప్రసన్నరావు ఎన్నికయ్యారని పరిశుద్ధ పేతురు పాలు చర్చి డీనరీ చైర్మన్ రెవరెండ్ ఆనంద్‌కుమార్, ప్రెస్బిటర్ రెవెరెండ్ ఆశిష్ గాబ్రియేల్ తెలిపారు. సోమవారం కలపాడు చర్చిలో వారు మాట్లాడుతూ నంద్యాలలో మంగళవారం నిర్వహించనున్న బిషప్ కామనూరి సంతోష్ ప్రసన్న రావు పట్టాభిషేక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. కొత్త బిషప్ నాయకత్వంలో ప్రజలు ప్రేమ, శాంతి, నమ్మకం, సేవ అనే విలువలను అనుసరించాలని తెలిపారు. నంద్యాల డయాసిస్ అభివృద్ధికి ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. బిషప్ పట్టాభిషేక మహోత్సవాన్నికి గ్రామం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బేబీ సరోజ, శ్రీనివాస్ పాల్, రవి క్రీస్తుదారి, దయామూర్తి, సాల్మన్, మోజెస్, రవి, రత్న సుభాషిణి, సరళ తదతరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజల అవస్థలు



కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ప్రజలకు ఎటాంటి మేలు జరగకపోగా అవస్థలు పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ముసల్‌రెడ్డిపల్లె, బుచ్చంపల్లె గ్రామాల్లో బాబు షూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీలు, అమలు కాని పథకాల గురించి వివరించారు. సంవత్సర కాలంలో రైతుల పంటలకు గిట్టుబాటు ధరల్లేవని, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగాయని, ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దోచుకునేందుకు ప్లాన్ చేశారన్నారు. కూటమి పాలనలో అన్ని రంగాలు దెబ్బతిన్నాయన్నారు. జగనన్న పాలనకు చంద్రబాబు పాలనకు తేడా ప్రజలు గమనిస్తున్నారని నాగార్జునరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట వైస్ ఎంపీపీ చెన్ను రాజశేఖర్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు రాజీవ్‌బాష, అడ్వకేట్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు, నాయకులు నారాయణ, పీరయ్య, తిరుపతయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తాం



సమస్యలపై చర్చిస్తున్న డీఈఓ షంషుద్దీన్

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని డీఈఓ షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం గ్రామంలో జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు గ్రామ ప్రజలు పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డీఈఓ పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ పాఠశాలకు కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన డీఈఓ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీ నిత్యానంద్, ఏఏఎంఓ విజయభాస్కరుడు, ఎంఈఓ శోభారాణి, హెడ్ టీచర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి

చాపాడు : మండల వ్యాప్తంగా బంగారు కుటుంబాలను త్వరగా గుర్తించాలని మండల అభివృద్ధి అధికారి వీర కిషోర్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో సోమవారం ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలపై గ్రామ సచివాలయ సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకూ ప్రతి గ్రామ పంచాయతీలో బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. రెండు మూడు రోజులలో బంగారు కుటుంబాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలన్నారు. మండల స్థాయి, గ్రామ సచివాలయ ఉద్యోగుందరూ పేద కుటుంబాల వారిని దత్తత తీసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో పేదలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ప్రచారం

ఖాజీపేట : ఖాజీపేటలోని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఖాజీపేటలోని ఆర్యవైశ్య సంఘం తరఫున ప్రతి రెండు సంవత్సరాలకు ఒక సారి అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల్లో చాలా వరకు సంఘంలోని సభ్యులు అందరూ కలసి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరుగుతుంది. అయితే ఈ నెలలో జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరక పోవడంతో పోటీ తప్పలేదు. సాధారణ ఎన్నికల మాదిరిగానే 3వ తేదీన నామినేషన్ కార్యక్రమం జరిగింది. అందులో మడియం మురళీ, తాతా వెంకట సుబ్రమణ్యం అధ్యక్ష పదవి కోసం నామినేషన్ దాఖలు చేశారు. ఎవరూ ఉపసంహరించుకోక పోవడంతో పోటీ తప్పలేదు. దీంతో 4వ తేదీ నుంచి పోటీ పడుతున్న సభ్యులు ఖాజీపేటలోని ఆర్యవైశ్య సంఘంకు చెందిన 183 ఇళ్లకు వెళ్తూ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. 7వ తేదీన అమ్మవారిశాలలో ఓటింగ్ జరగనుంది. అనంతరం పోటీ చేసిన అభ్యర్థులలో గెలిచిన వారికి అధ్యక్ష పదవి వరించనుంది.

విద్యార్థుల హక్కులు కాలరాసే జీఓను రద్దు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీకి తప్ప ఇతరులకు ప్రవేశం లేదని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు జారీ చేసిన జీఓను రద్దు చేయాలని పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయరాజు తెలిపారు. సోమవారం వారు తమ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు వెలికితీసి పరిష్కారానికి కృషి చేస్తున్నాయని పేర్కొన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు విద్యను బోధించకుండా సొంత పనులు చేసుకుంటున్నారని, కొందరు మద్యం సేవించి పాఠశాలలకు వస్తున్నారని, అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు.

విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

మైదుకూరు : పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మైదుకూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలు బయటకు రాకుండా తొక్కి పెట్టేందుకే విద్యాశాఖ ఇలాంటి ఉత్తర్వులను ఇచ్చిందని ఆరోపించారు. ఈ ఉత్తర్వులతో ఇక నుంచి ప్రైవేటు విద్యాసంస్థల విద్యా వ్యాపారం, అన్యాయాలు వెలుగు చూసే అవకాశం లేకుండా పోతుందన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు ఆసుపత్రులలో అర్హత ఉన్న వారు మాత్రమే స్కానింగ్ చేయాలని సూచించారు. స్కానింగ్ మిషన్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకుని స్కానింగ్‌కు వచ్చే వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, అలాంటి చర్యలకు పాల్పడిన వైద్యులు, స్కానింగ్ సెంటర్ల యజమానులపై, ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం పరిశీలన

కోటవీధి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని వల్లెరవారిపల్లె సచివాలయంను సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం సందర్శించింది. వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా గణాంక అధికారి ఎ.రమేష్ రెడ్డి మాట్లాడుతూ మాతా శిశు మరణాల నియంత్రణకు కృషి చేయడంతో పాటు గర్భిణులు, బాలింతలు, కౌమార దశ బాలికలలో రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ నారాయణ, డేటా పర్యవేక్షకులు రాజశేఖర్, డీపీహెచ్ఓ శాంతికళ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వి.మల్లేష్, వైద్యాధికారులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సౌమ్య, సీహెచ్ఓ చంద్రావతి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజయోగసాధనతో మానసిక ప్రశాంతత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లీలా బెహన్‌జీ

ప్రొద్దుటూరు కల్చరల్ : రాజయోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో జీవించవచ్చని బెంగళూరుకు చెందిన ఆంధ్ర, కర్ణాటక ఓంశాంతీల సబ్‌జోన్ డైరెక్టర్ బీకే లీలా దీదీ పేర్కొన్నారు. స్థానిక విజయనగరం వీధిలోని ఓం శాంతి భవన్‌లో సోమవారం ఆత్మీయ స్నేహ మిళనం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 80 ఏళ్ల క్రితం ఉండే ఉమ్మడి కుటుంబంలో అన్యోన్యతలు, ఆప్యాయత అనురాగాలు ఇటీవలి కాలంలో గృహ ధర్మానికి చెందిన రాజయోగం మానవ హితానికి, మనో వికాసానికి, స్వీయ ఉన్నతికి, జీవన సమతుల్యతకు దివ్య ఔషధమన్నారు. కుటుంబ విలువలు, సుఖసంతోషాలతో మిళితమైన రాజయోగ జీవనం ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. రాజయోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోయి ఆనందమయ జీవితం గడపవచ్చని వివరించారు. ఆరావళి పర్వతాల నుంచి తెచ్చిన పవిత్ర కంకణాలను అందరికి కట్టారు. కార్యక్రమంలో శాంత బెహన్‌జీ, సుశీల బెహన్‌జీ, సౌజన్య బెహన్‌జీలు, బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్యాలయం ఎప్పుడూ మూతే!



తెరుచుకోని వ్యవసాయ కార్యాలయం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని మండల వ్యవసాయ కార్యాలయం ఎప్పుడూ మూతపడి ఉంటుంది. సోమవారం నుంచి శనివారం వరకు తెరిచే వారే లేరు. మండల పరిధిలోని రైతులు వ్యవసాయ శాఖకు సంబంధించిన పనులపై మండల కేంద్రానికి వచ్చి.. వెనుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో ఉన్న వ్యవసాయ సమస్యలు ఆయా గ్రామ సచివాలయంలో పరిష్కారం కాకపోవడంతో మండల కేంద్రంలో ఉన్న వ్యవసాయ కార్యాలయానికి వెళ్లాలని అక్కడి సిబ్బంది సూచనలు చేస్తున్నారు. దీంతో మండల పరిధిలో ఉన్న పలువురు రైతులు వ్యవసాయ కార్యాలయానికి వస్తున్నారు. కనీసం సోమవారం కూడా తలుపులు తెరవకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో అటెండర్ స్థాయి సిబ్బంది కూడా లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

బద్వేలు అర్బన్ : కాశినాయన మండల పరిధిలోని నాయునిపల్లె, అక్కెంగుండ్ల గ్రామాల్లోని ప్రభుత్వ భూమిని రిజర్వు ఫారెస్టుకు బదలాయించే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని ఆ భూమిని పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల భూమిలేని నిరుపేదలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాశినాయన మండలంలోని ఆయా గ్రామాల భూమిలేని నిరుపేదలకు ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకుని పంపిణీ చేస్తామని టీడీపీ నేతలు వాగ్దానం చేశారని, ఆ మేరకు ప్రభుత్వ భూములను పేదలకే పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ భూములను రిజర్వు ఫారెస్టుకు అప్పగిస్తామనడం అన్యాయమని, ఆ భూములను పేదలకే కేటాయించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, కెవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండిజకరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్, కాశినాయన మండల కార్యదర్శి ఓబయ్య, నాయకులు బాబు, సుబ్బారావు, లక్ష్మయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.